ప్రభుత్వ రంగ సంస్థలను పరిరక్షించాలి

హిమాయత్‌నగర్‌లో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న బాల నరసింహ

హిమాయత్‌నగర్,జనవరి31: దేశంలోని ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడి యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు తగిన చర్యలు తీసుకోవాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ఎం.బాల నరసింహ డిమాండ్ చేశారు.శుక్రవారం హిమాయత్‌నగర్‌లో డీహెచ్‌పీఎస్ రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరిగింది.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం దళితుల సంక్షేమానికి చొరవ తీసుకోకపోవడంతో పాటు నిధులకు సైతం కోతపెడుతుందని ఆరోపించారు.దళితులకు భద్రత కల్పించి ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్లు అమలు చేయాలన్నారు.కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు బీసీ,ఎస్సీ,ఎస్టీలకు అసైన్డ్ రైతులకు మేలు చేయాలని డిమాండ్ చేశారు.ఈ సమావేశంలో డీహెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కె.యేసురత్నం,రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అనిల్ కుమార్,నేతలు కె.సహదేవ్,ఆరుట్ల రాజుకుమార్,జె.కుమార్ స్వామి,టి.రామకృష్ణ,వెంకట స్వామి,వై.ఉషశ్రీ,లక్ష్మిపతి,రాజరత్నం తదితరులు పాల్గొన్నారు.

నీటి ఎద్దడి రాకుండా చూడండి

మణికొండ, జనవరి 31: అధికారుల అలసత్వం కారణంగా రానున్న వేసవి కాలంలో ప్రజలకు నీటి ఇబ్బందులు ఎదురయ్యే ప్రమాదం ఉందని మణికొండ మున్సిపాలిటీ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు సీతారాం ధూళిపాళ అన్నారు. అల్కాపురి రోడ్డు నంబర్ 4లోని మున్సిపాల్ స్పోర్ట్స్ పార్క్‌లో జలమండలి 2.5 ఎంఎల్‌డీ, కృష్ణారెడ్డి కాలనీలోని రిజర్వాయర్‌లను బీఆర్ఎస్ నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ రిజర్వాయర్ల పనులు పూర్తి అయినా వాడుకలోకి తీసుకురావడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు. నెమలి నగర్‌లో రిజర్వాయర్ కట్టడానికి స్థల సేకరణ జరిగినా అధికారుల అశ్రద్ధ కారణంగా నిర్మాణం పనులు మొదలు కాలేదన్నారు.

సంబంధిత అధికారులు అన్ని విషయాలు పరిగణలోకి తీసుకొని వెంటనే రిజర్వాయర్ నుంచి మంచి నీటి సరఫరా చేసి ప్రజలకు మేలు చేయాలన్నారు. రానున్న వేసవి కాలంలో ఇబ్బందులకు గురయ్యే అవకాశం ఉందన్నారు. ఈ విషయంలో గతంలో ఖైరతాబాద్ జలమండలి అధికారులను కలిసి వినతిపత్రం కూడా అందజేశామన్నారు. ఈ కార్యక్రమంలో వర్కింగ్ ప్రెసిడెంట్ కుంభగళ్ల ధనరాజ్, ప్రధాన కార్యదర్శి గుట్టమీది నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

అల్కాపూర్‌లోని స్పోర్ట్స్ పార్క్‌లోని రిజర్వాయర్‌ను పరిశీలిస్తున్న మణికొండ మున్సిపాలిటీ బీఆర్ఎస్ నాయకులు

సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కుల పంపిణీ

సీఎం సహాయ నిధి చెక్కులను కుటుంబ సభ్యులకు అందజేస్తున్న ఎమ్మెల్యే టి.ప్రకాశ్ గౌడ్

మణికొండ, జనవరి 31: సీఎం సహాయ నిధి ద్వారా పేద ప్రజలను ఆదుకుంటున్నామని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్ అన్నారు. శుక్ర వారం ఎమ్మెల్యే నివా సంలో మణికొండ ప్రాంతానికి చెందిన జొన్నాడ శ్రీలతకు రూ. 30 వేలు, పుప్పాలగూడ ప్రాంతానికి చెంది న రేణుకకు రూ. 30 వేల చొప్పున మంజూరైన సీఎం సహాయ నిధి చెక్కులను అంద జేశారు. ఈ కార్యక్రమంలో నార్సింగి మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ బుద్దోళ్లు శ్రీరాములు, సీనియర్ నాయకులు పిట్టల సత్యనారాయణ, మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఏర్పుల కుమార్, శ్రావణ్‌కుమార్, విజయ్‌రెడ్డి, సంపత్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

మెట్రో స్టేషన్ వద్ద అగ్ని ప్రమాదం

ఖైరతాబాద్, జనవరి 31: నిత్యం రద్దీగా ఉండే ఖైరతాబాద్ మెట్రో స్టేషన్ పక్కన శుక్రవారం రాత్రి అగ్ని ప్రమాదం జరిగింది. మెట్రో స్టేషన్ కింద విశ్వేశ్వరయ్య భవన్ సమీపంలో ఒక్కసారిగా మంటలు ఎగిసిపడటంతో ప్రయాణికులు ఆందోళనకు గురయ్యారు. వెంటనే అప్రమత్తమైన మెట్రో సిబ్బంది భద్రతా చర్యలు చేపట్టి, స్టేషన్‌లో లిఫ్టును నిలిపివేశారు. అగ్ని మాపక సిబ్బంది ఘటనాస్థలికి చేరుకొని మంటలను అదుపు చేశారు. ఈ ఘటనలో ఎలాంటి నష్టం జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

5న జరిగే నిరసనను విజయవంతం చేయాలి

హిమాయత్‌నగర్,జనవరి31: కార్మికవర్గం ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడంలో కేంద్రం అవలంభిస్తున్న తీరును వ్యతిరేకిస్తూ ఫిబ్రవరి 5న రాష్ట్ర వ్యాప్తంగా జరిగే నిరసనలో కార్మికులు అధిక సంఖ్యల్లో పాల్గొని విజయవంతం చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎం.నరసింహ పిలుపు నిచ్చారు.శుక్రవారం హిమాయత్‌నగర్‌లోని ఎస్ఎన్‌రెడ్డి భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ కార్మికుల త్యాగాలు,పోరాటాల చేసిన ఫలితంగా సాధించుకున్న 44 కార్మిక చట్టాలను కేంద్రం నాలుగు కోడ్‌లుగా మార్చి వేసి కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా చట్టాలను సవరించిందని ఆరోపించారు.

ప్రజా సమస్యలపై అధికారులు దృష్టిసారించాలి

మణికొండ, జనవరి 31: ప్రజా సమస్యలపై దృష్టి సారిస్తూ సమస్యలు ఎదురు కాకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని మణికొండ మున్సిపాలిటీ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు సీతారాం ధూళిపాళ అన్నారు. శుక్రవారం మణికొండ మున్సిపాలిటీ స్పెషల్ ఆఫీసర్‌ను కలిసి ప్రజలు పడుతున్న ఇబ్బందులపై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రాఫిక్ సమస్య కారణంగా ప్రజలు రోడ్లపైకి రావాలంటేనే నరకయాతన అనుభవించాల్సిన దుస్థితి ఏర్పడుతుందన్నారు. మురుగునీరు రోడ్లపై ప్రవహిస్తూ దయనీయంగా తయారైందన్నారు. పుప్పాలగూడలో అంబేద్కర్ భవనం నిర్మాణానికి గతంలో రూ.49 లక్షలు మంజూరయ్యాయని ఆ నిధులు ఎటువెళ్లిపోయాయో తెలుపకుండా దాటవేయడం మున్సిపల్ అధికారులకే చెల్లుబాటు అయిందన్నారు. శ్మశానవాటికకు వెళ్లే దారి కూడా మూసి వేసి ప్రజల రాకపోకలకు ఇబ్బందులు సృష్టిస్తున్నారన్నారు. అధికారుల నిర్లక్ష్య ధోరణి స్పష్టంగా కనిపిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కుంబగళ్ల ధనరాజ్, గుట్టమీది నరేందర్, ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

మణికొండ మున్సిపాలిటీ స్పెషల్ ఆఫీసర్‌ను వినతిపత్రం అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకులు.

పరామర్శ

ఇటీవల అనారోగ్యానికి గురై..చికిత్స పొంది కోలుకున్న తెలంగాణ జాగృతి నేత తేజా చౌదరిని శుక్రవారం ఖైరతాబాద్ రాజ్‌నగర్‌లోని ఆయన నివాసంలో ఎమ్మెల్సీ కవిత పరామర్శించారు. -ఖైరతాబాద్, జనవరి 31

సర్కార్ బడిలో తాగునీటి కనెక్షన్ ఏర్పాటు చేయాలి

పాఠశాలలో మంచినీటి కనెక్షన్ ఏర్పాటు చేయాలని జలమండలి అధికారికి వినతిపత్రం అందజేస్తున్న నవయువ యూత్ క్లబ్ సభ్యులు

మైలార్‌దేవ్‌పల్లి, జనవరి 31: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు కావాల్సిన మౌలిక సదుపాయాల కల్పనకు తమవంతు బాధ్యతగా కృషి చేయడం జరుగుతుందని నవయువ యూత్ క్లబ్ అధ్యక్షులు ఏర్వ కుమార స్వామి అన్నారు. మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ దుర్గానగర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను శుక్రవారం క్లబ్ ప్రతినిధులతో కలిసి సందర్శించారు. పాఠశాలలో మంచినీటి సౌకర్యం సరిగ్గా లేకపోవడంతో పాటు బోర్‌వెల్ నీరు సరిపోవడం లేదని విద్యార్థులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను క్లబ్ సభ్యుల దృష్టికి తీసుకువచ్చారు. ఈ మేరకు హెచ్‌ఎండబ్ల్యూఎస్‌ఎస్‌బీ అధికారులను కలిసి వాటర్ కనెక్షన్ ఏర్పాటు చేసి విద్యార్థులకు సమస్యలు రాకుండా చూడాలని వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ ఉపాధ్యక్షులు రమేష్‌రెడ్డి, నవీన్ రెడ్డి, జలావుద్దీన్, ప్రసాద్, రఘునాయక్, పృథ్వీరాజ్ తదితరులున్నారు.

విద్యుత్ అధికారుల
నిర్లక్ష్యంతో ప్రమాదాలు

బండ్లగూడ, జనవరి 31: విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంతో ప్రజలు ప్రమాదాల బారిన పడుతున్నారని కిస్మత్‌పూర్ మాజీ సర్పంచ్ నిరుడు శేఖర్‌ముదిరాజ్ పేర్కొన్నారు. బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని రాక్ చర్చి వద్ద శుక్రవారం ఓ లారీ విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టింది. ఈ ఘటనలో విద్యుత్ స్తంభం రోడ్డుపై పూర్తిగా నేల కొరిగింది. ఆ సమయంలో వాహనదారులు, ప్రజలు ఎవరు లేక పోవడంతో ఎలాంటి ప్రమాదం జరగలేదు. విషయం తెలుసుకున్న శేఖర్‌ముదిరాజ్ ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించి విద్యుత్ అధికారులకు ఫోన్ ద్వారా సమాచారం అందించారు. వెంటనే విద్యుత్ సరఫరా నిలిపి వేసి మరమ్మతులు చేపట్టాలని అధికారులను కోరారు. కార్పొరేషన్ పరిధిలో ఇటీవల అధికారులు రోడ్ల విస్తరణ చేపడుతూ విద్యుత్ స్తంభాలను తొలగించకపోవడంతో ఇలాంటి ప్రమాదాలు జరుగుతున్నాయని ఆయన పేర్కొన్నారు. దీంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్లపై ఉన్న విద్యుత్ స్తంభాలను తొలగించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

ఏఐపై అవగాహన పెంచుకోవాలి

సదస్సును ప్రారంభిస్తున్న మేఘనాథ్ చౌహాన్

ఖైరతాబాద్, జనవరి 31 : భవిష్యత్ కృత్రిమ మేధస్సు దేనని, దానిపై పూర్తి స్థాయిలో అవగాహన పెంచుకోవాలని ఇన్‌కం ట్యాక్ కమిషనర్ కె. మేఘనాథ్ చౌహాన్ అన్నారు. ది ఇనిస్టిట్యూషన్ ఆఫ్ ఇంజినీర్స్ ఇండియా తెలంగాణ స్టేట్ సెంటర్ ఆధ్వర్యంలో ఖైరతాబాద్‌లోని విశ్వేశ్వరయ్యభవన్‌లో 'ఏఐ డ్రివెన్ డిజిటల్ ట్విన్స్ ఇన్ మెకానికల్ అండ్ థర్మల్ ఇంజినీరింగ్ సిస్టమ్స్' అనే అంశంపై ఏర్పాటు చేసిన సదస్సును లీడ్స్ ఫార్మా ప్రైవేట్ లిమిటెడ్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ బి. ప్రభా శంకర్, ఐఈఐ చైర్మన్ డాక్టర్ జి. వెంకటసుబ్బయ్య, కార్యదర్శి డాక్టర్ కె. సీతారాంబాబు, మాజీ చైర్మన్ ప్రొఫెసర్ డాక్టర్ బి. రమణా నాయక్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వివిధ రంగాల్లో ఏఐ వినియోగం, ఉపయోగాలపై వివరించారు. ఈ కార్యక్రమంలో ఐఈఐ ప్రతినిధులు డాక్టర్ ఐ. సూర్యనారాయణ రాజు, డాక్టర్ ఎస్. నాగ భూషణ్ రావు, డాక్టర్ సి. శ్యామ్ సుందర్ తదితరులు పాల్గొన్నారు.

ఏడాదిన్నర పాలనలో ఉత్తమాటలే

హైదరాబాద్ జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్ పర్సన్ ప్రసన్న రామ్మూర్తి

ఖైరతాబాద్, జనవరి 31 : కాంగ్రెస్ ప్రభుత్వం పథకాల పేరుతో ఊదరగొట్టడమే కాని....ఏడాదిన్నర పాలనలో చేసిందేమి లేదు. రేషన్‌కార్డులు, పింఛన్లు ఇస్తాం.. డబుల్ బెడ్రూం, ఇందిరమ్మ ఇండ్లు కట్టిస్తాం దరఖాస్తులు చేసుకోవాలని ఉత్తమాటలు చెప్పారు. అమాయక ప్రజలు ప్రజాభవన్ వద్ద లక్షలాదిగా తరలివచ్చి పడిగాపులు పడుతూ దరఖాస్తులు చేసుకున్నారు. ఇప్పటి వరకు కొత్త పింఛన్ల ఊసే లేదు... బీఆర్ఎస్ హయాంలో ఇచ్చిన పాత పింఛన్లకు దిక్కే లేదు. గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ముందుకు తీసుకోలేకపోవడం ప్రభుత్వ అసమర్థ పాలనకు నిదర్శనం.

ప్రతిపక్షాలపై బురద జల్లుడు తప్ప అభివృద్ధిపై కనీసం సమీక్ష చేయడం లేదు. ప్రజల సమస్యలను గాలి వదిలి ఊదరగొట్టే డైలాగులు, గత ప్రభుత్వంపై కక్షసాధింపు చర్యలతోనే ముఖ్యమంత్రి కాలయాపన చేస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేకత తాజా పోల్స్‌తోనే తేటతెల్లమైందన్నారు.

సీఎంఆర్ఎఫ్, ఎల్వోసీ చెక్కులు పంపిణీ..

ముఖ్యమంత్రి సహాయ నిధి పేద, మధ్యతరగతి ప్రజలకు వరంగా మారిందని రహ్మత్‌నగర్ కార్పొరేటర్ సీఎన్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక కార్యాలయంలో కార్మికనగర్‌కు చెందిన ఎస్.శ్రీనివాసులుకు సీఎంఆర్ఎఫ్ కింద మంజూరైన రూ.55 వేలు, జె.శ్రీనివాస్‌కు రూ.75 వేల చెక్కులను లబ్ధిదారులకు ఎల్ఓసీతో పాటు అందజేశారు. - జూబ్లీహిల్స్,జనవరి 31

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మైలార్‌దేవ్‌పల్లి, జనవరి 31: విద్యుత్ మరమ్మతుల కారణంగా పలు ఫీడర్లల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం విధిస్తున్నట్లు అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు.

- మైలార్‌దేవ్‌పల్లి ఫీడర్ పరిధిలో ఉదయం 11:30 నుంచి 12 గంటల వరకు మైలార్‌దేవ్‌పల్లి గ్రామం, ప్రగతి కాలనీ, బృందావన్ కాలనీ, టాటానగర్,
- కాటేదాన్ సబ్‌స్టేషన్ పరిధిలోని లక్ష్మీగూడ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 12 నుంచి 3 గంటల వరకు లక్ష్మీగూడ గ్రామం, హౌసింగ్ బోర్డు కాలనీ, ఆర్‌జీకే, బాంబే కాలనీ, బృందావన్ కాలనీ, గణేష్‌నగర్ తదితర ప్రాంతాల్లో కోత ఉంటుందన్నారు. విద్యుత్ వినియోగదారులు గమనించి సిబ్బందికి సహకరించాలని కోరారు.

ప్రభుత్వ స్థలం ఆక్రమించేందుకు
యత్నిస్తున్న వారిపై కేసు

బంజారాహిల్స్,జనవరి 31: ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించేందుకు యత్నిస్తున్న వ్యక్తులపై జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళ్తే.. జూబ్లీహిల్స్ రోడ్డు నంబర్ 46లోని మస్తాన్ నగర్‌ను ఆనుకుని ఉన్న అంబేద్కర్ కాలనీలో జేఎన్ఆర్ఎం స్కీమ్ కింద గతంలో ఇండ్ల నిర్మాణం చేపట్టారు. మొత్తం ఐదు బ్లాకుల నిర్మాణం చేపట్టాల్సి ఉండగా నాలుగు మాత్రమే పూర్తయ్యాయి. మరో బ్లాక్‌కు కేటాయించిన సుమారు 1500 గజాల స్థలం ఖాళీగా ఉంది.

ఇటీవల బస్తీకి చెందిన కొంతమంది నేతలు ఈ స్థలాన్ని ప్లాట్లు గా విభజించుకుని ఆక్రమించుకునేందుకు యత్నిస్తున్నారు. దీనిలో భాగంగా స్థలంలో ఉన్న బండరాళ్లను తొలగించి చదును చేస్తున్నారు. ఈ విషయంపై సమాచారం అందుకున్న షేక్‌పేట మండల తహసీల్దార్ అనితారెడ్డి శుక్రవారం పరిశీలన చేపట్టారు. ఆక్రమణలను గుర్తించిన తహసీల్దార్ కూల్చివేతలు చేపట్టాలని ఆదేశించారు. అనం తరం తహసీల్దార్ శుక్రవారం జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేయగా బీఎన్ఎస్ 329(3), 324(2) రెడ్‌విత్ 3(5) సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

హెల్మెట్ లేని ప్రయాణం.. ప్రాణాలతో చెలగాటం

జాతీయ రహదారి భద్రత మాసోత్సవం ముగింపు కార్యక్రమంలో డీసీపీ రాహుల్ హెగ్డే ఐపీఎస్..

యూసుఫ్‌గూడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ట్రాఫిక్‌పై అవగాహన అనంతరం హెల్మెట్‌లు ధరించిన విద్యార్థులతో ట్రాఫిక్-1 డీసీపీ రాహుల్ హెగ్డే ఐపీఎస్

జూబ్లీహిల్స్,జనవరి 31 : హెల్మెట్ లేని ప్రయాణం ప్రాణాలతో చెలగాటమని.. హెల్మెట్‌తో ప్రయాణం సురక్షితమని నార్త్ అండ్ వెస్ట్ జోన్ ట్రాఫిక్-1 డీసీపీ రాహుల్ హెగ్డే ఐపీఎస్ పేర్కొన్నారు. జాతీయ రహదారి భద్రత మాసోత్సవం-2025 కార్యక్రమంలో భాగంగా శుక్రవారం యూసుఫ్‌గూడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వెస్ట్‌జోన్ ట్రాఫిక్ ఏసీపీ కట్ట హరిప్రసాద్‌తో కలిసి విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు హెల్మెట్లు పంపిణీ చేశారు. హైదరాబాద్ ట్రాఫిక్ విభాగం ఆధ్వర్యంలో నెలరోజులుగా నిర్వహిస్తున్న రహదారి భద్రత మాసోత్సవం ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ తప్పనిసరని.. నిండైన జీవితానికి హెల్మెట్ ప్రయాణం అవసరమన్నారు. విద్యార్థులకు హెల్మెట్ ప్రాధాన్యతను వివరించడంతో పాటు పిల్లలు తమ తల్లిదండ్రులు హెల్మెట్ ధరిస్తేనే బండి ఎక్కాలని సూచించాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులచేత ట్రాఫిక్ నియమాలు పాటిస్తామని.. తల్లిదండ్రులకు హెల్మెట్ ఉంటేనే బండి ఎక్కుతామని ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఆర్‌నగర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ పి.సైదులు, హెచ్ఎం పి.పరమేశ్వరమ్మ, బి.నరసింహ, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

నూతన కార్యాలయ భవనం పరిశీలన

బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ నూతన భవనాన్ని సందర్శించి పరిశీలిస్తున్న ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్

బండ్లగూడ, జనవరి 31: బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ నూతన కార్యాలయ భవనాన్ని శుక్రవారం రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్ సందర్శించి పరిశీలించారు. 10వ డివిజన్‌లోని సర్వే నెంబర్ 181లో 2.07 ఎకరాల ప్రభుత్వ స్థలంలో జీ ప్లస్1 అంతస్తులతో రూ.1282.00 లక్షలతో భవనాన్ని నిర్మించారు. ప్రజల సౌకర్యార్థం అత్యంత అధునాతన పద్ధతిలో నిర్మాణాలను పూర్తి చేసి అన్ని వసతులు కల్పించడం జరిగిందని తెలిపారు.

ఈ నెల 6న ఉదయం 10.30 గంటలకు ఈ భవనాన్ని ప్రారంభోత్సవం చేపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ బి.శరత్‌చంద్ర, మాజీ కార్పొరేటర్లు, మున్సిపల్ అధికారులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎస్సార్‌నగర్ ఇన్‌స్పెక్టర్‌కు రివార్డు

సీపీ సీవీ ఆనంద్ నుంచి ప్రశంసా పత్రాన్ని అందుకుంటున్న ఎస్.ఆర్.నగర్ ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్ రెడ్డి

వెంగళరావునగర్, జనవరి 31: మిస్టరీగా మారిన కేసును సాంకేతిక ఆధారాలతో విజయవంతంగా ఛేదించిన ఎస్సార్‌నగర్ పోలీసులను నగర పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్ ప్రశంసించారు. అమీర్‌పేటలో గత సంవత్సరం అక్టోబర్ 2న బల్కంపేటకు చెందిన సర్దార్ గురుప్రీత్ సింగ్ (26) అనే సాఫ్ట్‌వేర్ ఉద్యోగి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. అమీర్‌పేట గురుద్వారా బస్తీలో నివాసం ఉండే గురుప్రీత్ సింగ్ పెద్దనాన్న కుమారుడు బల్బీర్‌సింగ్ ఇంటికెళ్లి అక్కడ మృత్యువాత పడ్డ ఘటనపై అనుమానాస్పదంగా ఉండడంతో పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి అక్కడ ఉన్న సీసీ కెమెరాలు,సాంకేతిక ఆధారాలను సేకరించి అతడిని హత్య చేశారని తేల్చారు. నిందితులపై హత్య కేసు నమోదు చేసి జైలుకు పంపించారు. ఈ కేసును ఛేదించిన ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్‌రెడ్డి, ఎస్సై రాజు రాథోడ్‌లను గురువారం జరిగిన కార్యక్రమంలో సీపీ సీవీ ఆనంద్ అభినందించి ప్రశంసా పత్రంతో పాటు నగదు రివార్డును అందజేశారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత

మండలంలోని నర్సూడ గ్రామానికి చెందిన చాకలి వెంకటయ్య కుటుంబ సభ్యులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును శుక్రవారం ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు నీరటి రాజుముదిరాజ్, ఎస్ శ్రీనివాస్, నీరటి అశోక్,విశ్వనాథం, రక్షిత్‌గౌడ్,నీరటి నర్సింహ,వికాస్‌లతో పాటు పలువురు ఉన్నారు. - శంషాబాద్ రూరల్, జనవరి 31

బాడీ బిల్డింగ్‌లో.. భిక్షపతికి అవార్డు

ఏజీ క్లాసిక్ 2025 బాడీ బిల్డింగ్ పోటీలు ఇటీవల హైదరాబాద్‌లో నిర్వహించారు. బాడీ బిల్డింగ్‌లో శంషాబాద్ మండలంలోని కాచారం గ్రామానికి చెందిన మైలారం భిక్షపతి మొదటి స్థానంలో నిలిచారు. దీంతో ఆయన అవార్డు దక్కించుకున్నారు. దీంతో అవార్డును శుక్రవారం ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్ చేతుల మీదగా అందజేసి ఘనంగా సన్మానించారు. -శంషాబాద్ రూరల్

పదో తరగతి విద్యార్థులకు నేటి నుంచి అల్పాహారం

జూబ్లీహిల్స్,జనవరి 31: ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థులకు నేటినుంచి అల్పాహారం పంపిణీ చేయనున్నారు. గతేడాది సెప్టెంబర్ నుంచి సాయంత్రం 1 గంట.. డిసెంబర్ నుంచి రెండు పూటలా అదనపు తరగతులు నిర్వహిస్తున్న అధికారులు ఎట్టకేలకు విద్యార్థులకు అల్పాహారం అందించేందుకు నిర్ణయం తీసుకున్నారు. ఈ ఏడాది మార్చి 21 నుంచి పదో తరగతి పరీక్షలు ప్రారంభం కానున్న నేపథ్యంలో విద్యార్థులలో అలసట రాకుండా ఉండేందుకు అల్పాహారాన్ని అందించనున్నారు.

ఈ మేరకు ఫిబ్రవరి 1 నుంచి మార్చి 20 వరకు అల్పాహారాన్ని అందించాలని పాఠశాల విద్యాశాఖ సంచాలకులు ఈవి నర్సింహారెడ్డి ఆదేశాల జారీ చేసిన విషయం తెలిసిందే. పదో తరగతి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు ఆరు రకాల అల్పాహారాన్ని లేదా అందులో అందుబాటులో ఉండే ఆహారాన్ని అందించేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

షాపింగ్ కోసం..
వెళ్లివచ్చేసరికి..

రూ.25 వేల నగదు, ఇతర వస్తువులు చోరీ

బంజారాహిల్స్,జనవరి 31: షాపింగ్ కోసం వెళ్లివచ్చేసరికి కారు వెనక సీట్లో పెట్టిన బ్యాగ్‌తో పాటు ఖరీదైన వస్తువులు మాయమైన ఘటన బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే..మాదాపూర్‌లో నివాసం ఉంటున్న సంజనా కోనేరు అనే యువతి గురువారం సాయంత్రం బంజారాహిల్స్ రోడ్డు నంబర్ 10లోని సిల్క్ బండార్ స్టోర్‌కు షాపింగ్ కోసం వచ్చింది. పక్కనే ఉన్న మధు సిల్క్ బండార్ షాపు వద్ద కారు పార్క్ చేసి షాపింగ్ కోసం వెళ్లింది. గంటన్నర తర్వాత షాపింగ్ అనంతరం కారువద్దకు రాగా వెనకసీట్లో పెట్టిన బ్యాగులు కనిపించలేదు. బ్యాగుల్లో సుమారు రూ. 25వేల నగదు, ఏటీఎమ్ కార్డులు, ఇయిర్ పాడ్స్, పవర్ బ్యాంక్ తదితర సామగ్రి ఉన్నాయని, చోరీకి పాల్పడిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని శుక్రవారం బాధితురాలు బంజారాహిల్స్ పోలీసులకు ఫిర